సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 5 । మే । 2023





**తగ్గుతున్న నీటిమట్టం**
ప్రాజెక్టుల్లో నీటినిల్వలు తగ్గడంతో తాగు నీటి వరకే విడుదల చేస్తున్నారు.
వివరాలు 8లో ▸



**వైభవంగా కల్యాణం**
మన్యంకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.
వివరాలు 8లో ▸

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం 32.1 /24.4
ఎండ ప్రభావం ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### కేజీబీవీలో బదిలీలకు దరఖాస్తు చేసుకోండి

నాగర్‌కర్నూల్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది కోరుకున్న పాఠశాలకు మార్చుకునేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాలు ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన ప్రత్యేక అధికారులు, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, ఏఎన్‌ఎం, అకౌంటెంట్లు పరస్పర బదిలీలకు అర్హులని, httpr://transfer-.cdre.telangana.gov.in నందు ఈనెల 6 నుంచి 9 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడునని, సమగ్ర వివరాలు, సూచనలు, మార్గదర్శకాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, బదిలీలు చేసుకునే సిబ్బంది నిబంధనలు, మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### వేరుశనగ క్వింటా రూ.6,626

కల్వకుర్తి రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 247 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. క్వింటాకు గరిష్ఠంగా రూ.6626, సరాసరి రూ.5116, కనిష్ఠం రూ.4001 ధర లభించింది. అలాగే, ఆముదాలకు క్వింటా రూ.5501 ధర పలికింది.

### త్వరలో క్యాన్సర్ డేకేర్ సెంటర్ ఏర్పాటు



వనపర్తి: జిల్లాలో అతి త్వరలో క్యాన్సర్ డేకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌సీడీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ జగన్నాథ్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన జిల్లా ఆస్పత్రిలోని ఆలన, ఎన్‌సీడీ క్లినిక్, ఎల్డర్‌లీ కేర్ సెంటర్, జిల్లా మనోవికాస చికిత్స కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్యాన్సర్ డేకేర్ సెంటర్ రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఫాలో కీమోథెరపీ ఇక్కడే చేయించుకోవచ్చన్నారు. ప్రభుత్వం మానసిక ఆరోగ్య సమస్యల నివారణకు 'టెలి మానస్' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని.. విద్యార్థులు, ఇతరులు ఎవరైనా మానసిక ఆరోగ్య సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్ 14416కు కాల్‌చేసి ఉచిత సలహాలు, సూచనలు పొందవచ్చని వివరించారు. 'టెలిమానస్'లో పొందిన సేవలు సరిపోకపోతే ఆస్పత్రిలో చేర్పించుకొని సంపూర్ణ స్వస్థత పొందే వరకు చికిత్స అందిస్తారని తెలిపారు. జాతీయ వయోవృద్ధుల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గురువారం ఫిజియోథెరపీ సేవలను ఎల్డర్‌లీ కేంద్రాల్లో నిర్వహిస్తామని.. అవసరమైన వృద్ధులు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆయనవెంట డా. సాయినాథ్‌రెడ్డి, జిల్లా ఎన్‌సీడీ కో–ఆర్డినేటర్ డా. సాయిరెడ్డి, మహేష్, అశోక్, స్టాఫ్ నర్సులు అలీ, రమ తదితరులు పాల్గొన్నారు.

### బీచుపల్లిలో అంజన్న ఉత్సవాలు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా రెండో రోజు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, ఉపనయనం, పల్లకీసేవ, పూజలు సన్నాయి వాయిద్యాల నడుమ ఎంతో వైభవంగా చేశారు. అనంతరం రాత్రి ప్రభోత్సవం (చిన్నతేరు) అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఉమారాణి, పాలక మండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### పలు రైళ్లు తాత్కాలికంగా రద్దు

పాలమూరు: మహబూబ్‌నగర్ మండల పరిధిలోని దివిటిపల్లి దగ్గర జరుగుతున్న ఆర్‌ఓబీ బ్రిడ్జి పనుల నేపథ్యంలో జడ్చర్ల–మహబూబ్‌నగర్ మధ్య నాలుగు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. 07275 బోధన్–మహబూబ్‌నగర్ రైలును జడ్చర్ల–మహబూబ్‌నగర్ మధ్య, 07587 మహబూబ్‌నగర్–కాచిగూడ రైలును మహబూబ్‌గర్–జడ్చర్ల మధ్య, 07583 కాచిగూడ–మహబూబ్‌నగర్ రైలును జడ్చర్ల–మహబూబ్‌నగర్ మధ్య, 07584 మహబూబ్‌నగర్–కాచిగూడ రైలును మహబూబ్‌నగర్–జడ్చర్ల మధ్య 5 నుంచి 11వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు.

# ప్రైవేట్‌కు ధాన్యం

## జిల్లాలో ప్రారంభం కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు



వెల్దండ మండలకేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం



'ఈ ఫొటోలోని రైతు పేరు సాగర్. జిల్లాలోని తాడూరు మండలం చర్లఇటిక్యాల గ్రామానికి చెందిన రైతు సాగర్ 14 రోజుల కిందట వరిపంటను కోశాడు. అయితే ఇప్పటివరకు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి కొనుగోళ్లను ప్రారంభించలేదు. దీంతో జిల్లాకేంద్రంలో సమీపంలోని మిల్లుకు ధాన్యాన్ని తరలించాడు. మిల్లు నిర్వాహకుడు బస్తాకు కిలోన్నర చొప్పున కట్ చేసుకున్నాడని వాపోయాడు. గ్రామంలో అధికారులు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో అకాల వర్షాల భయానికి ప్రైవేటు మిల్లులకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.'

- అకాల వర్షాల నేపథ్యంలో నేరుగా మిల్లర్లకు విక్రయిస్తున్న రైతులు
- క్వింటాకు నాలుగైదు కిలోల చొప్పున అదనంగా కట్ చేస్తున్న మిల్లుల నిర్వాహకులు
- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం కొనుగోలు చేసింది 1,069 మెట్రిక్ టన్నులే

| జిల్లాలో ఏర్పాటుచేయనున్న కొనుగోలు కేంద్రాలు | ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనవి |
|---|---|
| 214 | 20 |
| ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 2.27 లక్షల మెట్రిక్ టన్నులు | ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం 1,069 మెట్రిక్ టన్నులు |

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా వరికోతలు ప్రారంభమై ధాన్యం కేంద్రాలకు తరలుతున్నా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు కొనుగోళ్లు చేపట్టకపోవడం, మరోవైపు అకాల వర్షాలకు చేతికొచ్చిన పంటను కోల్పోవాల్సి వస్తుందన్న భయంతో కొంతమంది రైతులు నేరుగా మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా మిల్లర్లు సైతం బస్తాకు రెండు నుంచి మూడు కిలోల చొప్పున అదనంగా తూకం వేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాలను ప్రారంభించి, వేగంగా తూకం వేస్తే ప్రైవేటుకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు.

### ఇప్పటివరకు కొన్నది వెయ్యి మెట్రిక్ టన్నులే..

**జిల్లాలో మొత్తం 214 కొనుగోలు కేంద్రాలకు ప్రస్తుతం 20 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈసారి సీజన్‌లో మొత్తం** 1.50లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మొత్తం 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు కొనుగోలు చేసింది మొత్తం 1,069 మెట్రిక్ టన్నులు మాత్రమే. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో చాలావరకు ధాన్యం ప్రైవేటుకు తరలుతోంది. దీంతో జిల్లాలో ప్రభుత్వ లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ చేపట్టకుండా, కొంతమేరకు కొనుగోళ్లకే అధికారులు పరిమితం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### తేమ శాతం ఉంటే వెంటనే కొనుగోలు చేస్తున్నాం..

జిల్లాలో ఈసారి మొత్తం 214 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నాం. జిల్లాలోని చాలాచోట్ల ఇంకా వరికోతలు పూర్తికాలేదు. ఇప్పుడిప్పుడే ధాన్యం సెంటర్లకు వస్తోంది. కేంద్రానికి వచ్చిన ధాన్యం నిర్ణీత తేమ శాతం ఉంటే వెంటనే కొనుగోలు చేస్తాం.
– మోహన్‌బాబు, జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి

**జిల్లావ్యాప్తంగా ప్రారంభమైనవి 20 కేంద్రాలే..**
జిల్లాలో ఈసారి మొత్తం 214 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. కోతల సీజన్ ప్రారంభమై పదిరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా కేవలం 20 కేంద్రాలను మాత్రమే అధికారులు ప్రారంభించారు. ఇవి కూడా కొల్లాపూర్ నియోజకవర్గంలోనే అధికంగా ఉన్నాయి. మిగితా చోట్ల ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం కాలేదు. ఇప్పటికే జిల్లాలోని బిజినేపల్లి, తాడూరు, తిమ్మాజిపేట, తెలకపల్లి, నాగర్‌కర్నూల్ మండలాల్లో వరిపంటను కోసం పది రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కాక రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. అకాల వర్షాల నేపథ్యంలో కల్లాలకు తెచ్చిన ధాన్యం నీటిపాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో చాలాచోట్ల వరికోతలు పూర్తయ్యి రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో ఇంకా కాంటాలు మొదలు కావడం లేదు. ధాన్యం ఇప్పుడిప్పుడే కేంద్రాలకు వస్తోందని, తేమ శాతం సరిగ్గా ఉంటే కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

**తేమ పేరుతో కొర్రీలు..**
అయితే ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 17శాతం తేమ ఉంటే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం చేపట్టాలి. కానీ జిల్లాలోని చాలా కేంద్రాల్లో 16 నుంచి 14 శాతం వరకు ఉంటేనే తీసుకుంటున్నారు. అప్పటివరకు రైతులతో మళ్లీ ఆరబోయిస్తున్నారు. కొన్నికేంద్రాల్లో తేమ శాతం ఉన్నా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లర్లకే విక్రయిస్తున్నారు.

# రైతులను ఇబ్బంది పెట్టొద్దు



తెలకపల్లి మార్కెట్ యార్డులో వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

- వరి ధాన్యంలో తేమ శాతం పెరిగినా కొనుగోలు చేయండి
- కలెక్టర్ ఉదయ్‌కుమార్

తెలకపల్లి: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం తెలకపల్లి సింగిల్ విండో కార్యాలయం, మార్కెట్‌యార్డులోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అకాల వర్షాల వల్ల ఇప్పటికే రైతులు ఇబ్బందులు పడుతున్నారని తేమ విషయంలో ఎలా ఉన్నా వారిని ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తాలు విషయంలో నిబంధనల మేరకు తరుగు తీయాలని, క్వింటాకు 5–6 కిలోల తరుగు తీయవద్దన్నారు. ధాన్యం తెచ్చే రైతులకు అవసరమైన కవర్లు అందజేయాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లర్లకు పంపేలా చూసుకోవాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో వెన్నుపూస తెగులు వచ్చి దిగుబడి తగ్గిందని, విక్రయానికి ఇక్కడికి తెచ్చి ఆరబెట్టగా వర్షానికి తడిసి పోతుందని, రాత్రి సమయాల్లో పంటకు పందుల బెడద పెరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేలా సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి ధాన్యం గింజను కొనాలని కలెక్టర సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ జిల్లా అధికారి మోహన్‌బాబు, డీఎం బాలరాజు, తహసీల్దార్ తబితా రాణి, సింగిల్ విండో సీఈఓ ధర్మవీర్, ఆర్ఐ రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

**అంధత్వ నివారణకే కంటి వెలుగు..**
అచ్చంపేట: కంటి చూపు మందగించిందని దిగాలు చెందకుండా కంటివెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా కంటిపరీక్షలు అద్దాలు తీసుకొని సంతోషంగా ఉండాలని, అంధత్వ నివారణకే ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చందాపూర్‌లో నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి అక్కడికి వచ్చిన వృద్ధులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి కంటి సమస్యల నుంచి విముక్తి కల్పించడానికి కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని, మీతో పాటు ఇంకా ఎవరికైనా కంటి సమస్యలు ఉంటే వారిని ఈ కార్యక్రమానికి వచ్చేలా చూడాలన్నారు. నాణ్యతతో కూడిన పరీక్షలు నిర్వహించి కచ్చితత్వంతో కూడిన అద్దాలు ఇవ్వాలని అధికారులు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట ఆర్డీఓ పాండు నాయక్,తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ తారాసింగ్ తదితరులు ఉన్నారు.

### కుట్టు శిక్షణా శిబిరాలతో మేలు

అమ్రాబాద్: వృత్తిపరమైన కుట్టు శిక్షణా శిబిరాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పదర ప్రాథమికోన్నత పాఠశాలలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తయిన విద్యార్థులు వేసవి సెలవుల్లో ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి వెంకట లక్ష్మి, దమయంతి, తహసీల్దార్ కృష్ణయ్య ఎంపీడీఓ శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని లాభాల బాట పట్టించాలి

కొల్లాపూర్: ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు అధికారులు, కార్మికులు కృషి చేయాలని హైదరాబాద్ జోన్ ఈడీ ఏ.పురుషోత్తం సూచించారు. గురువారం ఆయన కొల్లాపూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్, డిపోను పరిశీలించారు. బస్టాండ్‌లో వస్తు విక్రయాల ధరలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరల ప్రకారమే వస్తువులను విక్రయించాలని సూచించారు. డిపోలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లతో పాటు పలువురు కండక్టర్లకు ఆదర్శ ఉద్యోగులుగా ప్రశంసా పత్రాలు అందించారు. వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు.



మాట్లాడుతున్న ఈడీ పురుషోత్తం

కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీదేవి, డీఆర్‌ఎం శ్యామల, డీఏఈ పోచయ్య, డీఎం రాజేశ్వర్, ఏఎస్ఐ రామస్వామిగౌడ్, ఎస్టీఐ బాలసరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# పంపుహౌస్ పనులు వేగవంతం



మార్కండేయ ఎత్తిపోతల పథకం పనుల రిపోర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: మార్కండేయ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే రిజర్వాయర్ కోసం నిర్మించే పంపుహౌస్ పనులు వేగవంతం చేసి.. త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. గురువారం బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి వద్ద నిర్మిస్తున్న పంపుహౌస్ పనుల్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రిజర్వాయర్ చుట్టూ నిర్మించే బండు పనులు ఇప్పటికే 50శాతం పూర్తి కాగా.. పంపుహౌస్ నిర్మించే చోట విద్యుత్ సబ్‌స్టేషన్, పంపుహౌస్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదిక చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా శాయిన్‌పల్లి, మమ్మాయిపల్లి, గంగారం, లట్టుపల్లి, ఇతర గిరిజన తండాలకు సాగునీరు అందడంలో పంటలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీనివాస్‌గౌడు, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# మాతాశిశు మరణాలను తగ్గించాలి



ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్

- ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పించాలి
- పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గడ్డం లక్ష్మణ్

అచ్చంపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాతాశిశు మరణాలు కాకుండా అన్ని వసతులు కల్పించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ వైద్యవిధాన పరిషత్‌ను కోరారు. గురువారం పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కాన్పు విషయంలో స్వీపర్‌ను సస్పెండ్ చేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ప్రసవ ప్రక్రియలో భాగంగా ఏప్రిల్25న కాన్పు కోసం వచ్చిన మంజుల సుఖ ప్రసవం కోసం ప్రయత్నించిన వైద్యులు, సిబ్బంది చేసిన ప్రయత్నంలో శిశువు శ్వాస సరిగా లేదని అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు రెఫర్ చేశారని, ఈ సమయంలో సరైన పరికరాలు లేక శిశువు మృతి చెందడం బాధాకరమన్నారు. ఇందుకు కారణంగా చూపుతూ స్వీపర్ నామాల కురువమ్మపై సస్పెండ్ చేయడం సరికాదన్నారు. కేవలం కింది స్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకోకుండా సమగ్ర దర్యాప్తు చేయాలని, సస్పెన్షన్ ఎత్తి వేయాలని తల్లి, బిడ్డ మరణాలు కాకుండా పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమాశంకర్, వెంకటేష్, బాలయ్య, వెంకటేశ్వరరావు ఉన్నారు.

# 'ఇనాం.. భోజనం'పై కలెక్టర్ ఆరా



48 ఎకరాల భూములపై కన్నేసి.. 24 ఎకరాలు మింగేసి..
ఇనాం.. భోజనం!



ఆ అధికారే కీలకం..

- 'సాక్షి' కథనానికి స్పందన
- సమగ్ర విచారణ జరపాలని కోస్గి తహసీల్దార్‌కు ఆదేశాలు
- పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని సూచనలు
- గుట్టుచప్పుడు కాకుండా సమాచారం సేకరిస్తున్న ఇంటెలిజెన్స్ వర్గాలు
- ఇనాం, టెనెంట్‌దారులతో పాటు బడా వ్యాపారవేత్తల్లో గుబులు

సాక్షి ఎఫెక్ట్..

కోస్గి: నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముక్తిపాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో 48 ఎకరాల వక్ఫ్ భూమిపై కన్నేసి.. 24 ఎకరాలను మింగేసిన వైనంపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. గతంలో పనిచేసిన జిల్లాస్థాయి ముఖ్య అధికారి అండ, మరో ఇద్దరు అధికారుల సహకారంతో ఓ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేసిన తీరు హాట్‌టాపిక్‌గా మారింది. నిబంధనలు ఉల్లంఘించి కిద్మత్ ఇనాం భూములకు రిజిస్ట్రేషన్ చేయడం.. రూ.5 కోట్ల డీల్ ప్రకారం డబ్బులు చేతులు మారడం.. అసలు తహసీల్దార్‌కు సంబంధం లేకుండా కలెక్టరేట్ నుంచే అక్రమంగా ప్రక్రియను పూర్తి చేయడం అధికార యంత్రాంగంలో అలజడి రేపింది. స్పందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ భూ వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి.. ఆధారాలతో సహా పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి నివేదిక అందజేయాలని కోస్గి తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు రికార్డుల పరిశీలనలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ భూములకు సంబంధించి పూర్వ, ప్రస్తుత రికార్డులు.. మార్పులు, చేర్పులు.. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన ధ్రువపత్రాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. మరోవైపు రంగంలోకి దిగిన రాష్ట్రస్థాయి ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం గుట్టుచప్పుడు కాకుండా ఆరా తీస్తున్నాయి. ఈ భూవ్యవహారంలో ఏయే అధికారులు ఉన్నారు.. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల ప్రమేయంపై కూపీ లాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటోందోననే గుబులు ఇనాం, టెనెంట్‌దారులతో పాటు కొనుగోలు చేసిన బడా వ్యాపారవేత్తల్లో నెలకొంది. కాగా, ఈ భూ వ్యవహారంపై తహసీల్దార్ మమతను సంప్రదించగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ జరుపుతున్నామని..పూర్తి వివరాలతో నివేదికను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆయా సర్వే నంబర్లకు సంబంధించి గెజిట్ వివరాలు కావాలని వక్ఫ్ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు.

### విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



లక్కీ డిప్ తీస్తున్న అడిషనల్ కలెక్టర్ మోతీలాల్

నాగర్‌కర్నూల్: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికు చేరుకోవాలని అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)కు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతి ప్రవేశం నిమిత్తం విద్యార్థుల లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో ఇద్దరు విద్యార్థులు టీ.గణేష్ రామంతపూర్, వై.కూర్మ సూర్యనారాయణ బేగంపేట్ పాఠశాలలకు ఎంపిక కాగా వెయిటింగ్ లిస్ట్‌లో మరో ఇద్దరు విద్యార్థులను ఉంచారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా నుండి 47 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఇద్దరు విద్యార్థులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రామ్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు రవాణా సౌకర్యం కల్పించండి

పెద్దకొత్తపల్లి: దివ్యాంగుల కోసం స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావస్థ కేంద్రానికి ఆయా గ్రామాల నుంచి వచ్చే వారి కోసం రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఓ నర్సింగరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి రోజు కేంద్రానికి దివ్యాంగులు చేరుకునేలా ఆటో సౌకర్యం కల్పించాలని ఏపీఎం అరుణకు సూచించారు. వారం వారం ఫిజియోథెరపీ పరీక్షలు చేయించాలని, సబ్సిడీపై పరికరాలను వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే, మహిళా సంఘాల ప్రభుత్వ రుణాల విషయాలను ఏపీఎంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేష్ పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నర్సింగరావు

## క్లుప్తంగా

### తల్లిపై కొడుకు దాడి

కోస్గి: భూమి పంపకాల విషయంలో తనకు న్యాయం చేయలేదనే కోపంతో తల్లిపై కొడుకు దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భక్తిమళ్లకు చెందిన బాలకిష్టయ్య తనకు వ్యవసాయ భూమి పంపక విషయంలో తల్లి అనసూయ న్యాయం చేయకుండా పక్షపాతంగా వ్యవహరిస్తుందని బుధవారం రాత్రి కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో తల్లి తలకు, చేతులకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై భర్త చంద్రయ్య ఫిర్యాదు మేరకు గురువారం కొడుకు బాలకిష్టయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆటోబోల్తా: నలుగురికి గాయాలు

వనపర్తి: ఆటో బోల్తాపడి నలుగురు గాయాలపాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని మెట్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండల కేంద్రంలో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆటో ముందు టైరు ఊడిపోవటంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ లింగేశ్వర్‌తో పాటు, వనపర్తికి చెందిన లక్ష్మి, చిట్టెమ్మ, చిమనగుంటపల్లికి చెందిన రేణుక గాయాలపాలయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

### నిందితుడికి జైలు శిక్ష

ఊట్కూరు: యువతిని మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష కోర్టు విధించినట్లు ఎస్‌ఐ రమేష్ గురువారం తెలిపారు. మండలంలోని ఎడివెల్లికి చెందిన రాజు నాలుగేళ్ల క్రితం ఓ యువతికి మాయమాటలు చెప్పి శారీరకంగా అనుభవించి మోసం చేయడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ సురేష్‌గౌడ్, సీఐ వెంకట్ కేసు నమోదు చేశారు. వాదోపవాదనలు అనంతరం బుధవారం జిల్లా సెషన్ జడ్జి రఫీ నిందితునికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.55వేల జరిమానా విధించారు.

### రిమాండ్‌కు తరలింపు

జడ్చర్ల: పట్టణానికి చెందిన మహిళల న్యూడ్ ఫొటోలు తీసిన కేసులో నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతున్న తిరుపతయ్యను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఫిబ్రవరి 22న నమోదైన కేసులో తిరుపతయ్య ప్రధాన నిందితుడిగా ఉన్నాడని సీఐ పేర్కొన్నారు.

### వివాహిత అదృశ్యం

గద్వాల క్రైం: వివాహిత అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండవ ఎస్‌ఐ అబ్దుల్‌షకూర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పోలిపల్లికి చెందిన భార్యాభర్తలు రేణుక, శివలు ఏప్రిల్ 30వ తేదీన బతుకుదెరువు కోసం గద్వాల జిల్లా కేంద్రానికి వచ్చారు. చీకటి పడడంతో కృష్ణవేణిచౌక్ సమీపంలో నిద్రకు ఉపక్రమించారు. ఉదయం లేచి చూసేసరికి భార్య కనిపించలేదు. దీంతో భర్త బంధువులను వాకాబు చేసిన ఎలాంటి ఫలితం లేకపోయింది. గురువారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కుక్కల దాడిలో 33 గొర్రెలు మృతి

గద్వాల క్రైం: కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని తెలుగోనిపల్లిలో చోటు చేసుకుంది. గొర్రెల యజమానులు శ్రీహరి, రామకృష్ణ తెలిపిన కథనం మేరకు.. గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో అకస్మాత్తుగా కుక్కలు గొర్రెలపై దాడి చేశాయి. ఇందులో 33 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 7 గొర్రెల పరిస్థితి సైతం విషమంగా ఉందన్నారు. ఈ సంఘటనలో దాదాపు రూ.2.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని గొర్రెల యజమానులు తెలిపారు.

### జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న స్థానిక వర్షాల ఆధారంగా ప్రాజెక్టుకు స్వల్ప వరద వస్తున్నట్లు అధికారులు చెప్పారు. గురువారం సాయంత్రానికి ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,983 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 మీటర్లు కాగా, రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టు నీటి మట్టం 315.710 మీటర్లుగా ఉంది. ప్రాజెక్టు నుంచి 106 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

**శ్రీశైలానికి స్వల్ప ఇన్‌ఫ్లో**

దోమలపెంట: కురుస్తున్న వర్షాలు వలన శ్రీశైలం జలాశయంకు స్వల్ప ఇన్‌ఫ్లో వస్తుంది. హంద్రీ నుంచి 117 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలంకు వస్తుంది. గురువారం జలాశయంలో నీటిమట్టం 807 అడుగులు, 32.6 టీఎంసీల నీటి నిల్వ 24గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్థానికంగా 34.40 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

# రైల్వే గేట్ మూసివేత?



గేట్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

- కష్టాలు మళ్లీ మొదటికి..
- గేటుకు రెండు వైపులా ప్రధాన వనరులు

దేవరకద్ర రూరల్: పట్టణ ప్రజల కష్టాలు మళ్లీ మొదటికి వచ్చేలా ఉన్నాయి. ఆర్‌ఓబీ నిర్మాణంతో దశాబ్దాల తమ కష్టాలకు పరిష్కారం లభించనుందని ఆనందించే లోపు వారి ఆశలు ఆవిరయ్యేలా ఉన్నాయి. భౌగోళికంగా పట్టణం రైల్వేగేట్‌కు రెండు వైపులా విస్తరించి ఉంది. పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చే అనేక మంది ఈ గేట్‌కు ఇరువైపులా రాకపోకలను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌ఓబీ పూర్తయిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఉన్న రైల్వే గేట్‌ను శాశ్వతంగా మూసివేస్తారనే ప్రచారం పట్టణ ప్రజలను కలవరపాటుకు గురిచేస్తుంది. ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అధికారులు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

**గేటుకు రెండు వైపులా వనరులు**

గేటుకు ఒక వైపు మార్కెట్ యార్డు, కొత్త బస్టాండ్, ముఖ్యమైన వ్యాపార సముదాయాలు ఉండగా, మరోవైపు జిల్లాలోనే పేరుగాంచిన పశువుల సంత, ప్రభుత్వ ఆస్పత్రి, ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, వాణిజ్య భవన సముదాయాలు, ఎక్కువ సంఖ్యలో నివాస గృహాలు ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రతి బుధవారం పెద్ద ఎత్తున కూరగాయాల సంత ఉండటంతో గేట్ మీదుగా రాకపోకలు సాగించక తప్పని పరిస్థితి నెలకొంది.



దేవరకద్రలో కొత్తగా నిర్మించిన ఆర్‌ఓబీ

**ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి..**

ఒకవేళ రైల్వేగేట్‌ను మూసివేయాలనుకుంటే అధికారులు ముందుగా స్థానిక ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో జిల్లా కేంద్రంలోని బోయపల్లి రైల్వే గేట్ వద్ద ఇలాంటి సమస్య తలెత్తగా ప్రజల అవసరాలను గుర్తించి, వారి నుంచి రైల్వే అధికారులు కొంత మేర డబ్బులు డిపాజిట్ తీసుకుని రైల్వేగేట్‌ను తెరిచి ఆవైపు ప్రజల రాకపోకలకు అనుమతిని ఇచ్చారు. అలాంటి అవకాశం మాకు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### పెరగనున్న సమస్యలు..

రైల్వేగేట్‌ను మూసివేస్తే ఆర్‌ఓబీ నిర్మాణం కంటే ముందు స్థానికంగా ఉన్న సమస్యలు రెట్టింపు కానున్నాయి. ప్రస్తుతం రాకపోకలు కొనసాగుతున్న రైల్వేగేట్‌ను మూసివేసి కొత్తగా నిర్మించిన ఆర్‌ఓబీపై రాకపోకలను కొనసాగించాలని చెబుతున్నారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ దారిలో హైదరాబాద్ - కర్నూల్ మీదుగా రోజులో పదులో సంఖ్యలో రైళ్లు వెళ్తుంటాయి. వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్యను నివారించడానికి ఆర్‌ఓబీ నిర్మించారు. రైల్వేగేట్‌ను మూసి, రాకపోకలకు ఆర్‌ఓబీపై అనుమతిస్తే రద్దీ పెరుగుతుంది. పట్టణ అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా బస్టాండ్ మధ్యలో ఉండటంతో కేవలం ఆర్‌ఓబీపై నుంచి పట్టణంలోకి బస్సులు వచ్చి వెళ్లాలంటే ట్రాఫిక్ పరంగా చాలా సమస్యలు ఉత్పన్నం అవుతాయి. స్థానికులు దాదాపు కిలో మీటరు మేర ఉన్న ఆర్‌ఓబీపై ప్రయాణించి తమ అవసరాలు తీర్చుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతారు. ముఖ్యంగా గేటుకు ఇరువైపులా ప్రధాన రహదారిపై విస్తరించి ఉన్న వ్యాపార సముదాయాలు గిరాకీ లేక మూతపడే అవకాశం ఉంది.

#### అధికారులకు తెలిపాం..



ఆర్‌ఓబీ పూర్తికావడంతో గతంలో ఉన్న రైల్వే గేట్ మీదుగా రాకపోకలు కొనసాగించేలా చూడాలని కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించాం. ఈ విషయంలో రైల్వేశాఖకు డబ్బులు ఏమైనా డిపాజిట్ చేయాల్సి వస్తే పంచాయతీ నుంచి లేదా స్థానికులు, వ్యాపారుల సహకారంతో ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని వివరించాం.

– కొండ విజయలక్ష్మి, సర్పంచ్, దేవరకద్ర

#### చాలా ఇబ్బందులు



ఆర్‌ఓబీ పూర్తయిన నేపథ్యంలో ప్రస్తుతం రాకపోకలు చేస్తున్న రైల్వే గేట్‌ను మూసివేస్తారని చెబుతున్నారు. ఈ నిర్ణయం వల్ల వ్యాపారాలు దెబ్బతింటాయి. ప్రతి అవసరానికి కిలో మీటరు మేర ఉన్న ఆర్‌ఓబీపై వెళ్లి రావాల్సి ఉంటుంది. ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గేట్‌ను తెరిచి ఉంచాలి.

– బాల్‌రాజు, స్థానికుడు

#### వ్యాపారాలు మూతపడుతాయి



గేటుకు ఇరువైపులా ప్రధాన రహదారికి ఆనుకుని దాదాపు 500 షాపుల వరకు ఉన్నాయి. ఒకవేళ రైల్వే గేట్‌ను మూసివేస్తే వ్యాపారాలు పూర్తిస్థాయిలో మూతపడుతాయి. నాయకులు, అధికారులు స్థానికుల ఇబ్బందులను, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే గేట్ మీదుగా ఎప్పటిలాగే రాకపోకలను అనుమతించాలి.

– రమేష్, వ్యాపారి, దేవరకద్ర

#### పశువులను ఎలా తీసుకెళ్లాలి



ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఆర్‌ఓబీ నిర్మించారు. అలాగే ప్రస్తుతం రాకపోకలు చేస్తున్న గేట్‌ను మూసివేస్తామని చెబుతున్నారు. దాని వల్ల ఇబ్బందులు కలుగుతాయి. జిల్లాలోనే పేరుగాంచిన పశువుల సంత దేవరకద్రలో ఉంది. పశువులను స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువస్తారు. వారు ఎలా రావాలి.

– ప్రేమ్‌కుమార్, చిన్నరాజమూర్, దేవరకద్ర

# వైభవంగా కల్యాణ మహోత్సవం



శేషవాహనంలో దేవతామూర్తుల ఊరేగింపు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తుల మధ్య స్వామివారి ఉత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన శేషవాహనంలో దేవతామూర్తులను ఉంచి గర్భగుడి నుంచి ఊరేగిస్తూ మైదానంలో పూల అలంకరణతో తయారు చేసిన మండపం వద్దకు తీసుకొచ్చారు. భక్తుల హరిన్నామశ్మరణ మధ్య ఊరేగింపు ముందుకు కదిలింది.

**కల్యాణోత్సవం..**

కల్యాణోత్సవం సందర్భంగా మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, శోభాయమానంగా అలంకరించిన కల్యాణ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో జీలకర్ర బెల్లం తదితర పూజల అనంతరం అమ్మవారికి మంగళసూత్రధారణ చేశారు. పురోహితుల వేద మంత్రాల మధ్య ఈ పవిత్ర ఘట్టాన్ని చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి దేవతామూర్తులకు పట్టువస్త్రధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవతామూర్తుల మీద వేసిన తలంబ్రాలను తీసుకెళ్లడానికి పోటీపడ్డారు. భక్తులకు దేవస్థానం తరఫున వారి చేతులకు పసుపుకొమ్మలను ధరింపచేశారు. కల్యాణోత్సవం అనంతరం దేవతామూర్తులను శేషవాహనంలో కల్యాణ మండపం నుంచి గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు.



అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి దేవతామూర్తులు

## 6న పాలమూరు-రంగారెడ్డి పనుల పరిశీలన

వనపర్తి: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఇరిగేషన్ సీఈ హమీద్‌ఖాన్, కేఎల్‌ఐ డీఈ సత్యనారాయణగౌడ్‌తో పనులపై చర్చించారు. కొత్త సచివాలయంలో మొదటగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సీఎం సమీక్ష నిర్వహించారని, జులై నాటికి కర్వెన, ఆగస్టు నాటికి ఉదండాపూర్‌కు నీటిని ఎత్తిపోయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ మేరకు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆయా రిజర్వాయర్ల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో పనుల పరిశీలన చేయాలని, మంత్రులతో పాటు సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్ పరిశీలనకు వస్తారన్నారు.

# యువ డాక్టర్ అంత్యక్రియలు పూర్తి



నిఖిల్ (ఫైల్)



అంతిమ యాత్రకు తరలివచ్చిన ప్రజలు

అమరచింత: పట్టణానికి చెందిన యువ డాక్టర్ చిన్ని నిఖిల్ తాను చనిపోయిన తన అవయవాలు పలువురికి ప్రాణంపోయాలని రాసుకున్న కవిత పలువురి హృదయాలను కంట తడిపెట్టించాయి. నెల్లూరు సమీపంలోని కావలిలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం తగిలి బ్రెయిన్ డెడ్‌కు గురై ఐదు రోజుల నుంచి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఉంచారు. బుధవారం రాత్రి నిఖిల్ అవయవాలను అక్కడి వైద్యులు తీసుకుని మృతదేహాన్ని తల్లితండ్రులకు అప్పగించారు. యువ డాక్టర్ మృతదేహాన్ని గురువారం స్వగ్రామమైన మండల కేంద్రానికి తీసుకొచ్చారు. విషయం తెలియగానే పట్టణంలోని ప్రజలు తరలివచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరుపెట్టుకున్నారు. బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య అంతిమయాత్ర అశ్రునయనాల మధ్య కొనసాగింది.

**కొడుకు కోరిక నెరవేర్చడం కోసం..**

వైద్య కోర్సులో చేరినప్పటి నుంచి నిఖిల్ తన మరణాంతరం అవయవాలను ఇతరులకు దానం చేయాలని పదే పదే చెప్పేవాడని తండ్రి చిన్ని రమేష్, తల్లి భారతి తెలిపారు. తన కుమారుడు ఇదే విషయాన్ని ఇంటికి వచ్చిన సందర్భాలలో చెబుతుండే వాడని వెల్లడించారు. చివరకు తను ఇలా రోడ్డు ప్రమాదంలో తమకు దూరమవుతాడని ఊహించలేదన్నారు. కొడుకు బతికి ఉన్నప్పుడు చెబుతున్న మాటలను నిజం చేయాలని అవయవాలు దానం చేశామన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


- గురుకుల విద్యాసంస్థల క్రీడల అధికారి రామలక్ష్మణ్

ఎర్రవల్లిచౌరస్తా: గురుకుల విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల క్రీడల అధికారి రామలక్ష్మణ్ తెలిపారు. గురువారం ఇటిక్యాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మింటన్ క్రీడా వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించి క్రీడాకారులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఆయా గురుకుల విద్యాలయాల నుంచి 90 మంది విద్యార్థులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి స్ఫూర్తితో మంచి క్రీడాకారునిగా ఎదగాలన్నారు. విద్యార్థుల క్రీడా నైపుణ్యాన్ని, వారు నేర్చుకున్న మెళకువలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. శిక్షణ శిబిరంలో సాయితేజ ప్రతిభను చూసి ఆయన ముగ్దులయ్యారు. కేవలం ఎడమ చేతితో ఇతర విద్యార్థుల కన్నా చక్కని ఆట తీరుని అభినందించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడి గురుకుల సంస్థకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. అనంతరం స్పార్కులెస్ బాల్ బ్యాట్మింటన్ వేసవి శిక్షణ 15 రోజుల పాటు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జ్ పీడీ భాస్కర్‌గౌడ్, శిక్షకులు చంద్రశేఖర్, నాగరాజు, రవి, మజ్జు ఉన్నారు.



విద్యార్థి సాయితేజను అభినందిస్తున్న అధికారి రామలక్ష్మణ్

# ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటిమట్టం



వెలవెలబోతున్న గోపల్‌దిన్నె జలాశయం

- ఆయకట్టుకు నీటి విడుదలతో తగ్గిన నీటి నిల్వలు
- ప్రస్తుతం తాగునీటికి మాత్రమే విడుదల
- జూరాల ప్రాజెక్టులో 9.657 టీఎంసీలకు గాను 3.628 టీఎంసీల నిల్వ

మదనాపురం: వనపర్తి జిల్లాలో ఉన్న ప్రధాన ప్రాజెక్టుల్లో నీటిమట్టం పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగు, తాగునీరు అందించే బహుళార్థక సాధక ప్రాజెక్టు జూరాలలో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలకు గాను 3.628 టీఎంసీలకు చేరింది. ఈ నీటిని తాగునీటి కోసం మాత్రమే వినియోగిస్తున్నారు.

**రెండు నెలల్లో ఖాళీ..**

జూరాల ప్రాజెక్టు, గోపల్‌దిన్నె, సరళాసాగర్, ఏనుగుంట బ్యాలెన్స్ రిజర్వాయర్, రంగసముద్రం, శంకర సముద్రం, కృష్ణ సముద్రం, కుంటలు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గాయి. గతేడాది వర్షాకాలం ప్రారంభంలో పూర్తిస్థాయిలో వర్షాలు కురువడంతో ప్రాజెక్టులు నిండాయి. ఖరీఫ్ సీజన్‌తో పాటు రెండో పంటకు నీరు పుష్కలంగా అందింది. దీంతో నిండు కుండలా ఉన్న ప్రాజెక్టులన్నీ ప్రస్తుతం వెలవెలబోతున్నాయి.

**జూరాల ఆయకట్టు 73వేల ఎకరాలు**

జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఉమ్మడి జిల్లాకు 73వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కుడి, ఎడమ కాల్వల ద్వారా జిల్లాలోని జలాశయాలను నింపుతున్నారు. ఇతర ఎత్తిపోతల పథకాలకు కూడా ఈ ప్రాజెక్టు నుంచి నీటిని వాడుకుంటున్నారు.

**ఈ సారి వర్షాలు రాకుంటే ఇబ్బందులే..**

వర్షాకాలం ప్రారంభంలోనే వర్షాలు వచ్చి కృష్ణానదికి వరద వస్తే తప్ప ఉమ్మడి జిల్లాలోని జలాశయాలకు సాగు, తాగునీరుకు ఢోకా ఉండదు. లేదా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కృష్ణానదికి వరద వచ్చి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండాలి. సరైన సమయానికి వర్షాలు రాకుంటే ఇబ్బందులు తప్పవని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటిమట్టం పూర్తిగా పడిపోయింది.



వట్టిపోయిన సరళాసాగర్ ప్రాజెక్టు

**జలాశయాల్లో నీటి మట్టం (టీఎంసీలలో..)**

| ప్రాజెక్ట్ | పూర్తి స్థామర్థ్యం | ప్రస్తుతం |
|---|---|---|
| జూరాల | 9.657 | 3.628 |
| రామన్‌పాడు | 0.299 | 0.249 |
| సరళా సాగర్ | 21 ఫీట్లు | 4 ఫీట్లు |
| గోపల్‌దిన్నె | 0.295 | 0.181 |
| ఏనుగుంట | 0.118 | 0.004 |
| రంగసముద్రం | 1.898 | 0.530 |
| శంకర్ సముద్రం | 1.818 | 0.203 |
| కృష్ణ సముద్రం | 1.150 | 0.040 |

**తాగునీటి కోసం మాత్రమే..**

జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటి సామర్థ్యం తగ్గింది. జూరాల, రామన్‌పాడు ప్రాజెక్టు, శంకర సముద్రం, గోపాల్‌దిన్నె, రంగ సము ద్రం జలాశయాల్లో ఉన్న నీటిని తాగునీటి కోసం మాత్రమే వినియోగిస్తున్నాం. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు వచ్చి, కృష్ణానది ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చి ప్రాజెక్టులు నిండితే పంటలకు అవకాశం ఉంటుంది.

– సత్యాశీలారెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ, వనపర్తి

## కూలీలపై తేనెటీగల దాడి

లింగాల: మండలంలోని దారారం సమీపంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలో పని చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగమణి, భాగ్యమ్మ, సంధ్య, గున్నమ్మ, రంగమ్మ, నాగమణి మొత్తం 11 మంది కూలీలు ఓ రైతు పొలంలో కుప్పగా పోసిన వేరు శనగను యంత్రంలో వేసే పని చేస్తున్నారు. ఈ సమయంలో కుప్పలో ఉన్న తేనెటీగలు ఒక్క సారిగా లేవడంతో కూలీలు పరుగులు తీశారు. ఈగలు పలువురిపై దాడి చేసి గాయపర్చాయి. కొంత మంది మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా, తీవ్రంగా గాయపడిన రంగమ్మ నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగ అవకాశం
శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు నూతనంగా ప్రారంభించే ఈ క్రింది శాఖలకు అతి త్వరగా బ్రాంచి మేనేజర్లు కావలెను. ఆన్ రోల్ పొసిషన్, స్పాట్ సెలక్షన్ కలదు.
ఏరియా మేనేజర్:
జీతం : 25,000 (fixed) + Incentives
వయస్సు : 25 - 40
అర్హత : ఏదైన డిగ్రీ
ఇంటర్వ్యూ తేదీలు : 05-05-2023, 06-05-2023
లొకేషన్స్ : అలంపూర్, గద్వాల, శాంతినగర్, అయిజ, మానవపాడు, అచ్చంపేట, కొల్లాపూర్, పెబ్బేరు & కర్నూల్ జిల్లా.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ ఓపెన్‌లో 10th, Inter, NIOS, TOSS, B.A., B.Com., CS, B.Sc., MA., M.Com., M.Sc., Distance Education, Guidelines for B.Tech. Detained / fail Students NICC, KPHB, Hyd. Ph: 8179882462, 7993997624

WANTED
■ రేమండ్ షోరూమ్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంచార్జ్, సేల్స్ ఇంచార్జ్ కావలెను. సెల్.9492801999, 08543796686.
■ శివమ్ మోటార్స్ మహబూబ్‌నగర్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్, టెక్నీషియన్, ఆఫీస్ బాయ్ కావలెను. సెల్.9491402020, 6281108441.
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18K-18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్. 9640258899
■ హైదరాబాద్‌లో పనిచేయుటకు ఉత్సాహవంతమైన యువతీ యువకులు కావలెను. POS : టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ స్టాఫ్, Qul : Inter / Degree, P/F, Food, Accomidation Free ✆ 88971 70985

సాక్షి ద్వారా మీ ఆత్మీయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం పంపాలి. - సాక్షి మేనేజర్